నమస్తే తెలంగాణ
హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, బుధవారం 24 ఏప్రిల్ 2024 | HYDERABAD

రేపు ఉప్పల్ స్టేడియంలో క్రికెట్ మ్యాచ్

అర్ధరాత్రి వరకు మెట్రో సేవలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : ఉప్పల్ క్రికెట్ స్టేడియంలో ఐపీఎల్ మ్యాచ్ నేపథ్యంలో మెట్రో అధికారులు అర్ధరాత్రి వరకు మెట్రో రైళ్లను నడుపనున్నారు. గురువారం రాజీవ్‌గాంధీ ఇంటర్ నేషనల్ క్రికెట్ స్టేడియంలో సాయంత్రం 7:30 గంటల నుంచి క్రికెట్ మ్యాచ్ ప్రారంభమై అర్ధరాత్రి వరకు జరుగుతుంది. ఈ నేపథ్యంలో కారిడార్-3లో మెట్రో రైళ్లను ప్రత్యేకంగా నడపాలని హైదరాబాద్ మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదేశించారు. ప్రతి రోజు రాత్రి 11 గంటల వరకు నడిచే మెట్రో రైలు క్రికెట్ మ్యాచ్ ముగిసిన తర్వాత క్రికెట్ చూసేందుకు వచ్చిన నగర వాసుల కోసం రాత్రి 12:15 గంటల వరకు చివరి మెట్రో రైలును నడపనున్నారు.

ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత

పవర్ ఐలాండ్ చేశాం

కాంగ్రెసోళ్లు మాత్రం కోతలతో తెలంగాణ పరువు తీశారు

హైదరాబాద్ వాసులు మా వైపే ఉన్నారు

అభివృద్ధిని నమ్మి ఓటేశారు

బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్

సిటీబ్యూరో, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ): ప్రపంచ నగరాలకు దీటుగా తాము హైదరాబాద్ నగరాన్ని మలిచి ఒక్క క్షణం కూడా కరెంటు పోకుండా పవర్ ఐలాండ్‌గా మారిస్తే కాంగ్రెసోళ్లు మాత్రం కరెంటు కోతలతో తెలంగాణ పరువు తీశారని బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని చూసి తమ పార్టీకే ఓటువేశారని నగరవాసులను కొనియాడారు. మంగళవారం నాడు టీవీ9 చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన అనేక విషయాలను చర్చించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ ఏమన్నారంటే 'ఒక్క క్షణం కూడా కరెంటు పోకుండా హైదరాబాద్‌ను పవర్ ఐలాండ్‌గా మార్చాం. పవర్ ఐలాండ్‌గా మార్చే క్రమంలో భాగంగా నేషనల్ గ్రిడ్‌లోకి చేర్చాలని నిర్ణయించాం. రాష్ట్రంలో అన్ని జెన్‌కో స్టేషన్‌లతో, బయటి నుంచి మనం తీసుకుంటున్న పవర్ లైన్లతో హైదరాబాద్‌ను కనెక్ట్ చేశాం. ఉదాహరణకు కొత్తగూడెంలో ఏదైనా కారణం చేత జెన్‌కోలో కరెంటు ఉత్పత్తి కాకపోయినా, రామగుండం నుంచి సరఫరా అవుతుంది. ఈ రెండే కాదు మరో చోట నుంచి పవర్ వచ్చేలా ఒక రింగును ఏర్పాటు చేసి దానికి అనుసంధానం చేశాం. ఇదే పద్ధతిలో హైదరాబాద్ నగరానికి కూడా అన్ని వైపులా కనెక్ట్ చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా వ్యవస్థను క్రమబద్ధీకరించాం. ప్రతి సారి రెండు విషయాలను బిజినెట్ మీట్‌లలో చెప్పేవాన్ని. యూ మే సీ ఇన్ పవర్ కట్ ఇన్ న్యూయార్క్! యూ మే సీ ఇన్ పవర్ కట్ ఇన్ లండన్! బట్ నాట్ ఇన్ హైదరాబాద్ (న్యూయార్క్‌లో పవర్ కట్ ఉండొచ్చు. లండన్‌లో కరెంటు పోవచ్చు. కానీ హైదరాబాద్‌లో పవర్‌కట్ చాన్సే లేదు) అని చెప్పాను. రాష్ట్రంలో విద్యుత్ పుష్కలంగా ఉంటే ఎన్నో బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. మా ప్రభుత్వంలో అంతరాయం లేకుండా విద్యుత్‌ను సరఫరా చేశాం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైంది. విద్యుత్ రంగంపై అవగాహన లేమి, అసమర్థతతో విద్యుత్ రంగంలో తెలంగాణ పరువు తీశారు. విద్యుత్ రంగంలో ఐఏఎస్‌ల కన్నా అతి ఎక్కువ అనుభవం ఉన్న టెక్నో క్రాట్స్‌కు ఈ విద్యుత్ సంస్థలను అప్పగించాను. ఈ రంగంలో పై నుంచి కిందిస్థాయి వరకు టెక్నో క్రాట్స్ ఉన్నారు. నేను అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు. కానీ ఈ రోజు కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందంటే విద్యుత్ రంగాన్ని ముందుకు తీసుకెళ్లగలిగే టెక్నో క్రాట్స్‌ను తొలగించి డిస్ట్రిబ్యూషన్ కంపెనీ, జెన్‌కో, ట్రాన్స్‌కో రంగాల్లో ఐఏఎస్ ఆఫీసర్లను నియమించింది. ఐఏఎస్ అధికారులు అసమర్థులని నేను నిందించను. వారు పరిపాలనా రంగంలో బాగా పనిచేస్తారు. కానీ విద్యుత్ లాంటి ప్రత్యేక రంగంలో టెక్నోక్రాట్స్ ఇంకా బాగా పనిచేస్తారు.

మొన్నటి వరకు.. తెలంగాణలో పవర్ బాగుంటుందని చెప్పుకునే పరిస్థితి ఉండేది. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ విధానాలతో మార్కెట్‌లో తెలంగాణ పరువు ఘోరంగా పోయింది' అని చెప్పారు. తాము చేసిన అభివృద్ధిని చూసి నగరవాసులు గత ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించారని చెప్పారు.

ముషీరాబాద్‌లో.. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ టీవీ చర్చను వీక్షిస్తున్న ఓ కుటుంబం

పవర్ ఐలాండ్ కోసం | కోటిన్నర మంది జనాభా కలిగిన ఈ మహానగరాన్ని పవర్ ఐలాండ్‌లా మార్చేసిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ఇందుకోసం సీఎం హోదాలో పవర్‌సప్లై డిస్‌ప్లేతో సమీక్ష జరుపుతున్న దృశ్యం (పాత ఫొటో)

కంటోన్మెంట్‌ను అభివృద్ధి పథంలో నడిపిస్తా

ప్రజల ఆశీర్వాదంతో ఐదుసార్లు తన తండ్రి సాయన్న, ఒకసారి తన చెల్లెలు గెలిచింది

బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత

కంటోన్మెంట్, ఏప్రిల్ 23 : కంటోన్మెంట్ నియోజకవర్గం ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తానని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి నివేదిత ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ప్రజల ఆశీర్వాదంతో ఐదుసార్లు తన తండ్రి సాయన్న, ఒకసారి తన చెల్లెలు లాస్యనందిత భారీ మెజార్టీతో గెలుపొందారని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్‌రెడ్డి, మాజీ సభ్యుల సహకారంతో రాబోయే రోజుల్లోనూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని చెప్పారు. నామినేషన్ కార్యక్రమానికి తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. నామినేషన్ పత్రాలు దాఖలు చేసేందుకు వెళ్లిన వారిలో బీఆర్ఎస్ అభ్యర్థి నివేదిత తల్లి గీత, బోర్డు మాజీ సభ్యులు అనితాప్రభాకర్, పాండు యాదవ్, సీనియర్ నాయకులు పనస సంతోష్ తదితరులు ఉన్నారు.

రేపటి నుంచే సమ్మర్ కోచింగ్

- ప్రారంభం కానున్న జీహెచ్ఎంసీ సమ్మర్ కోచింగ్ క్యాంపులు
- 37 రోజుల పాటు 44 రకాల ఆటలతో సిద్ధమైన అధికారులు
- 16 చోట్ల ఈత కొలనులను ఏర్పాటు చేసిన బల్దియా
- కోడ్ కారణంగా రాజకీయ ప్రమేయం లేకుండా ఈ సారి శిబిరాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 23(నమస్తే తెలంగాణ): ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులు సమ్మర్‌లో తెగ ఎంజాయ్ చేయాలనుకుంటారు. పల్లెటూర్లకు వెళ్లే వాళ్లు కొందరైతే స్విమ్మింగ్, స్కేటింగ్, బ్యాడ్మింటన్, క్యారం, చెస్, బాస్కెట్ బాల్, టేబుల్ టెన్నిస్ తదితర స్పోర్ట్స్‌లలో ప్రతిభ చాటాలని భావిస్తుంటారు. ఇందుకు, జీహెచ్ఎంసీ సమ్మర్ క్యాంపులను ఎంచుకుంటారు. జీహెచ్ఎంసీ కూడా క్రీడలకు పెద్ద పీట వేస్తూ ప్రతి సంవత్సరం పిల్లలకు విద్యతో పాటు ఆట పాటలు అవసరం ఉందంటూ ఔట్ డోర్, ఇండోర్ స్పోర్ట్స్‌తో పాటు పెయింటింగ్ తదితర మనోవికాసాన్ని పెంచే ఫన్నీ గేమ్స్‌లలో శిక్షణ ఇస్తుంటారు. ఈ నేపథ్యంలోనే పిల్లలకు సమ్మర్ హాలీడేస్ రావడం, ఆటల పట్ల ఆసక్తి కనబరిచే చిన్నారుల కోసం సమ్మర్ క్యాంపులను సిద్ధం చేసింది. రేపటి (గురువారం) నుంచి వచ్చే నెల 31వరకు 37 రోజుల పాటు 44 క్రీడలపై శిక్షణ ఇవ్వనున్నారు. గ్రేటర్ వ్యాప్తంగా 353 క్రీడా మైదానాలలో ఆరేండ్ల నుంచి 16 ఏండ్ల వయస్సు గల బాల బాలికలలో క్రీడా నైపుణ్యతను పెంపొందించి నిష్ణాతులైన క్రీడాకారులుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఏడు లాగే.. ఈ సారి వేసవి శిక్షణ తరగతలను నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. ఈ మేరకు 2024 వేసవి శిక్షణ తరగతుల షెడ్యూల్‌ను ప్రకటించనున్నారు. 44 క్రీడలతో పాటు 16 స్విమ్మింగ్ కేంద్రాలను సిద్ధం చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఈ సారి రాజకీయ నాయకుల జోక్యం లేకుండా జీహెచ్ఎంసీ అధికారులే ప్రారంభోత్సవాలు, ముగింపు కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ నెల 17న విక్టరీ ప్లే గ్రౌండ్‌లో స్పోర్ట్స్ గేమ్ ఇన్‌స్ట్రెక్టర్లు, కోచ్‌లు, ప్లేయర్లతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత ఆరు జోన్లలో రోజుకో జోన్ చొప్పున కోచ్‌లతో సమావేశం నిర్వహించి క్రీడా సామగ్రికి సంబంధిత బాధ్యులకు అప్పగించారు. ఈ నెల 25న సమ్మర్ కోచింగ్ క్యాంపులను ప్రారంభించి, వచ్చే నెల 6వ తేదీ నుంచి స్పోర్ట్స్ క్విజ్ పోటీలు, పదో తరగతి, ఇంటర్ సెంటర్లకు టోర్నమెంట్స్ మే 15 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, క్రికెట్, చెస్, క్యారమ్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, కబడ్డీ, రోలర్ స్కేటింగ్, సిపాక్ త్రో, టేబుల్ టెన్నిస్, టెన్నిస్, టెన్నికాయిట్, వాలీబాల్ కలిపి మొత్తం 16 రకాల క్రీడా టోర్నమెంట్లను నిర్వహించనున్నారు. వచ్చే నెల 27 నుంచి 31వ తేదీ వరకు రోజుకో జోన్‌లో వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమాలు చేపట్టి విజేతలను అవార్డులను ప్రదానం చేయనున్నారు. స్పోర్ట్స్ కోచ్ క్యాంపులలో రిజిస్ట్రేషన్‌కు రూ.50 ఫీజు షటిల్ బ్యాడ్మింటన్, రోలర్, స్కేటింగ్, క్రికెట్, టెన్నిస్ ఇతర గేమ్‌లకు రూ.10 చెల్లించాల్సి ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్‌కు www.sports, ghmc.gov.in నమోదు చేయాలని అధికారులు సూచించారు.

కాంగ్రెస్ చేతులెత్తేసింది

బండ్లగూడ, ఏప్రిల్ 23 : శ్రీరాముడిని మొక్కుదాం.. బీజేపీని ఓట్లతో తొక్కుదాం అని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారక రామారావు అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్‌లో చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌కు మద్దతుగా నిర్వహించిన నామినేషన్ ర్యాలీలో ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, కాలే యాదయ్య, అరికెపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవితో కలిసి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుద్వేల్ వద్ద వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ 10 నుంచి 12 పార్లమెంట్ సీట్లను గెలుచుకుంటే కాంగ్రెస్, బీజేపీ వారు కేసీఆర్ చెంతకు వచ్చి తమకు మద్దతు ఇవ్వాలని బతిమాలుతారని అన్నారు. పదేళ్ల పాలనలో బీజేపీ దేశానికి ఏం చేసిందని, తెలంగాణకు, చేవెళ్లకు ఏం చేశారని ప్రశ్నించారు. బీజేపీ నేతలు పాలమూరు ప్రాజెక్టుకు ఎందుకు జాతీయ హోదాను కల్పించలేదని అన్నారు. కేసీఆర్ ఇచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని పదవులలో కొనసాగిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి లాంటి వారు పార్టీ కష్టాలలో ఉన్నప్పుడు వదిలి వెళ్లారని మండిపడ్డారు. ఇలాంటి అవకాశవాదులను చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు నడుంబిగించాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి 200 నుంచి 220 వరకు, కాంగ్రెస్‌కు 150 నుంచి 200 వరకు వస్తాయని అనుకుంటున్నారని, కానీ ఆ పార్టీలకు దశదిశ లేదని విమర్శించారు. తెలంగాణలో పాలన చేతకాక కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుడే చేతులెత్తేసిందని ఎద్దేవచేశారు.



నామినేషన్‌లో ర్యాలీలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు సబితారెడ్డి, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్‌రెడ్డి, రోహిత్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు

అర చేతిలో వైకుంఠం చూపి.. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నిలదీయాలి

చేవెళ్ల గడ్డపై మరోసారి గులాబిజెండా ఎగురవేద్దాం

బడుగుల నేత కాసానిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి

పార్టీని వీడిన ఆ ఇద్దరికీ బుద్ధి చెప్పాలి

దశ.. దిశలేని పార్టీ బీజేపీ, పాలనే చేతకాని పార్టీ కాంగ్రెస్

తెలంగాణ అభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం

చేవెళ్ల పార్లమెంటు అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ మద్దతుగా ర్యాలీలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

శ్రీరాముడు అందరివాడు

శ్రీరాముడు అందరివాడని, ఆయన దేవుడు అని కేటీఆర్ తెలిపారు. రాముడితో ఇబ్బంది లేదు కానీ.. బీజేపీతోనే ఇబ్బంది అన్నారు. బీజేపీ నేతలు శ్రీరాముడి పేరుతో మత రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. దేశంలో బీజేపీ ఓడినా కూడా శ్రీరాముడికి నష్టం ఏమి లేదన్నారు. పదేళ్ల క్రితం బీజేపీ అధికారంలోకి వచ్చినప్పుడు క్రూడ్ ఆయిల్ ధరలు వంద డాలర్లు ఉండగా., ఇప్పుడు 84 డాలర్లకు వచ్చిందని తెలిపారు. పెట్రోల్ ధర రూ.70 ఉండగా 110 వరకు పెంచారని తెలిపారు. గ్యాస్ ధర 400 నుంచి 900 పెంచారని గుర్తు చేశారు. క్రూడాయిల్ ధరలు తగ్గినా.. పెట్రోల్, గ్యాస్ ధరలు తగ్గడం లేదని విమర్శించారు. అందుకే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో 12 సీట్లతో గెలిపిస్తే కేంద్రంలో చక్రం తిప్పి మనకు అవసరమైన వాటిని పొందవచ్చని తెలిపారు. బడుగు బలహీనవర్గాలకు చెందిన కాసాని జ్ఞానేశ్వర్‌ను కేసీఆర్ ఆశీర్వదించి పంపారని, ఆయనను భారీ మోజార్టీతో గెలిపించుకోవాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

అర చెతిలో వైకుంఠం చూపి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను ప్రజలు నిలదీయాలని కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్లి కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరితమైన హామీలను వివరించాలన్నారు. పరుగెత్తుకుంటూ వెళ్లి రెండు లక్షలు తెచ్చుకోవాలని పిలుపునిచ్చిన రేవంత్ రెడ్డి ఇప్పుడేమో రుణ మాఫీకి సమయం కావాలంటూ కొత్త గడువును విధిస్తున్నారని అన్నారు. 111 జీవోను తెలంగాణ ప్రభుత్వం ఎత్తి వేసిందని తద్వారా అనేక మంది రైతులకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు.

నేడు శామీర్‌పేటకు కేటీఆర్

మేడ్చల్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ) : మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేటలో బుధవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జరిగే ఎన్నికల సభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొననున్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి బుధవారం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి నామినేషన్ వేసే కార్యక్రమానికి ముందు నిర్వహించనున్న ఎన్నికల ప్రచార సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఎన్నికల ప్రచార సభలో ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు పాల్గొంటారని బీఆర్ఎస్ శ్రేణులు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

చేవెళ్ల పార్లమెంట్ నుంచి మొదటిసారిగా బీసీ నాయకుడు కాసాని

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ఇప్పటి వరకు బీసీలకు స్థానం దక్కలేదని కేటీఆర్ అన్నారు. అందుకే కేసీఆర్ బడుగు, బలహీన వర్గాలకు చెందిన బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్‌కు పార్లమెంట్ సీటును ఇచ్చి బరిలోకి దింపారని తెలిపారు. ఆయనను భారీ మోజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలతో పాటు అందరూ ఏకమై ఓటు వేసి గెలిపించుకుందామని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్నారు.



మంగళవారం రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాన్ని అందజేస్తున్న చేవెళ్ల ఎంపీ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, చిత్రంలో ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, మహేశ్‌రెడ్డి